

కర్ణాటకలో కాంగ్రెస్‌కు అధికారం మంచి పరిణామం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం దేశానికి మంచి పరిణామమని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ అన్నారు. రాబోయే కాలంలో దేశంలో కాంగ్రెస్ బలపడేలా ఉందని చెపా పరు. ప్రకాశం నగర్లోని ధర్మంచర కమ్యూనిటీ హాల్లో ఆయన జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ అల్లు బాబీతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. మార్గదర్శి చిట్‌ఫండ్‌పై చర్చకు వస్తున్నారని తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి జివి.రెడ్డి వెనక్కు తగ్గి మళ్లీ తరువాత వస్తున్నారని తెలిపారు. వస్తే చర్చ ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు. చిట్‌ఫండ్ కంపెనీలు నడిపే వారు వేరే వ్యాపారం చేయకూడదని చట్టం చెబుతోందన్నారు. ఎపి చిట్ ఫండ్ యాక్ట్‌ను కంపెనీలు పాటించడంలేదన్నారు. చీటీప బిదాయలను రాజకీయ కక్ష సాధింపు అంటే ఎలా అని ప్రశ్నించారు. చిట్ ఫండ్ సంస్థలు మూసివేస్తే బాధితులు నిలదీసేది ప్రభుత్వాన్నేనని అన్నారు.

ఎండలోనే ఉపాధి పనులు



పనుల్లో నిమగ్నమైన కూలీలు

- కూలీలకు కనీస సౌకర్యాలు కరువు
- వడ దెబ్బకు గురవుతున్న కూలీలు
- టెంట్లు అందుబాటులో ఉంచని పరిస్థితి
- నీటి సౌకర్యం, ప్రథమ చికిత్స కిట్లు కరువు

ప్రజాశక్తి రాజమహేంద్రవరం ప్రతినిధి

ఉపాధి హామీ పథకంలో పని చేసే కార్మికులు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. వేసవి నేపథ్యంలో ఉదయం 8 గంటలకు సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతున్న విషయం విదితమే. అలాంటి మండుటెండల్లోనే ఉపాధి హామీ కూలీలు పని చేయాల్సిన పరిస్థితి నెలకొంది. కూలీలు ఎండ బారిన పడి అస్వస్థతకు గురవుతున్న సంఘటనలు ఉన్నాయి. జిల్లాలో ఎండల తీవ్రతను బట్టి ఉపాధి హామీ కూలీలకు పని చేసే చోట కనీస సౌకర్యాలు కల్పించడంలో సంబంధిత శాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపమే ఈ దుస్థితికి కారణమని తెలుస్తోంది. వేసవి నేపథ్యంలో కనీసం టెంట్లు, తాగడానికి మంచి నీటి వసతిని కూడా కల్పించడం లేదని కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు సైతం ఇంటి వద్ద నుంచి వెంటతెచ్చుకోమని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రతీ సంవత్సరం ఉపాధి హామీ కూలీలకు కనీస సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పడమే తప్ప ఆచరణలో మాత్రం నెరవేర్చడం లేదు. ప్రతీ సంవత్సరం కూలీలు పడరాని పాట్లు పడుతున్నారు.

● కనీస సౌకర్యాలు మృగ్యం

జిల్లాలో ఏటా ఉపాధి హామీ పథకం ద్వారా పంట కాల్వలు, చెరువుల పూడికతీత తదితర పనులు ఉపాధి కూలీల ద్వారా చేయిస్తుంటారు. ఆధునీకరణతో నీటి నిల్వలను మరింత అభివృద్ధి చేసుకోవటంతో పాటు సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలు ఉంటాయి. కొన్ని ప్రాంతాల్లో పల్లెల్లో పనులు దొరకక కూలీలు పట్టణాలకు వలసలకు వెళ్తున్నారు. ఈ వలసలను ఆపేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పని కల్పిస్తున్నారు. ఇలా ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో 1.89 లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయి. వీటిలో 1.08 లక్షలు మాత్రమే యాక్టివ్ వర్కర్స్ జాబితాలో ఉన్నారు. వీరందరికీ పని దినాలు కల్పించడమే లక్ష్యంగా డ్వామా విభాగం లక్ష్యాలను పెట్టుకొని ఉపాధి హామీ పనులను చేయిస్తోంది. కానీ ఉపాధి హామీ పనులు చేసే చోట కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమవుతోంది. ఉదయం 8 గంటలకే ఎండలు విపరీతంగా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో ఇతరత్రా పనులు చేసేందుకు బయటకు వెళ్లాలనుకున్న వారు 10 గంటల లోపు ముగించుకొని ఇళ్లకు చేరుకుంటున్నారు. వ్యవసాయ కూలీలు, ఇతర కూలీ పనులు చేసే వారు సైతం ఉదయం 7 గంటలకే వెళ్లి 11 గంటల లోపు ముగించుకొని వస్తున్నారు. అయితే ఉపాధి హామీ పథకం కింద పని చేసే కూలీలు ఉదయం 6 గంటలకు విధులకు హాజరవుతుంటే తిరిగి ఇంటికి చేరుకునే సరికి మధ్యాహ్నం 2 గంటలు దాటుతోందని వాపోతున్నారు. .



జేగురుపాడులో ఉపాధి పనులకు వచ్చిన కూలీలు

● 'ఉపాధి' కూలీలకు తాగునీటికి తప్పని వెతలు

ఉపాధి కూలీలు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. నీడ వసతి, నీటి సౌకర్యాలు లేకపోవడంతో కూలీలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎర్రటి ఎండలో పని చేసిన కూలీలు కొద్ది సేపైనా సేదతీరడానికి టెంట్లు వేయాల్సి ఉంది. కానీ ఎక్కడా టెంట్లు వేయకపోవడంతో కూలీలకు స్థానికంగా నిలువ నీడ కరువవుతోంది. చెట్ల కిందికి వెళ్లి సేద తీరుతున్నారు. పని చేసే చోట నీటి సౌకర్యం లేక ఎండలకు వేడిగా అవుతోంది. దీంతో ఆ నీటిని తాగలేకపోతున్నారు. ఎండదెబ్బ తగిలి స్థానికంగా స్పృహకోల్పోతే ప్రథమ చికిత్స కిట్లు కూడా ఉండడంలేదు. నీటితో పాటు ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉంది. అధికారులు నీడ, నీటి వసతితో పాటు ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలని కూలీలు కోరుతున్నారు. మండలంలోని లెక్క చేయకుండా, కనీస సౌకర్యాలు కల్పించనప్పటికీ కూడా ఉపాధి హామీ పనులు చేస్తున్నా సమయానికి రోజుకు రూ. కనీస కూలి 200 కూడా రావటంలేదని కొందరు వాపోతున్నారు.

తాగునీరు ఇంటి నుంచి తెచ్చుకోమని చెబుతున్నారు



పని చేసే ప్రాంతాల్లో తాగునీటి వసతి కూడా కొన్నిసార్లు కల్పించడంలేదు. అదేమని అడిగితే ఇంటి వద్ద నుంచి తెచ్చుకోమని చెబుతున్నారు. గతంలో టెంట్లు వేసేవారు. గత ఏడాది నుంచి వేయడం లేదు. వడగాలులకు వృద్ధులం ఇబ్బందులు పడుతున్నాము. ప్రథమ చికిత్స కిట్లు గతంలో అందుబాటులో ఉండేవి. ఎవరికైనా వడదెబ్బ తగిలితే ప్రథమ చికిత్స చేసి ఆస్పత్రికి తరలించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. గత కొన్ని రోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు ఇబ్బందులు పడుతున్నాము.

- బుంగా ముసలయ్య, ఉపాధి కూలీ
మాధవరాయుడు పాలెం. కడియం మండలం


కూలీలకు మజ్జిగ పంపిణీ చేయాలి



కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. టెంట్లు లేకపోవటంతో చెట్ల కిందే సేద తీరుతున్నాము. ఉదయం 6 గంటలకు ఉపాధి పనులకు వస్తే తిరిగి ఇంటికి చేరుకునేసరికి మధ్యాహ్నం 2 గంటలకు ఇంటికి చేరుతున్నాము. రోజు కూలి రూ.200 మాత్రమే వస్తోంది. నర్సరీలలో పనులకు వెళ్తున వారికి ఆడవారికి రోజు కూలీ కనీసం రూ.400 పైగానే. ఉపాధి కూలీలకు కనీసం రూ.300 చెల్లించేలా ప్రభుత్వం పునరాలోచించాలి. పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలి. గతంలో ఇచ్చినట్లుగానే వేసవి అలవెన్సులు ఇవ్వటంతో పాటు మజ్జిగ పంపిణీ చేయాలి.

- పలివెల విజయలక్ష్మి ఉపాధి కూలీ,
మాధవరాయుడు పాలెం. కడియం మండలం

ప్రభుత్వ యంత్రాంగానికి వాలంటీర్ల మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా అర్హులను గుర్తించి అందజేయడంలో ప్రభుత్వ యంత్రాంగానికి వాలంటీర్ వ్యవస్థ మద్దతుగా నిలుస్తోందని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయ సమావేశ మందిరంలో వాలంటీర్‌కు వందనం జిల్లా స్థాయి కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్, మున్సిపల్ కమిషనర్ కె.దినేష్ కుమార్, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిల రెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్ ఆకుల వీర్రాజు పాల్గొన్నారు. విజయవాడ నుంచి నిర్వహించిన రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ ముఖ్యమంత్రి పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ, వాటికి అనుబంధంగా వాలంటీర్ వ్యవస్థను ప్రతి 50 నుంచి 100 ఇళ్లకు నియమించినట్టు తెలిపారు. ప్రతి వాలంటీర్ వారి సేవలను ప్రజలకు మరింత చేరువ చేసి, జాతి, మత, కుల, ప్రాంతీయ భేదాలకు తావు లేకుండా అర్హులైన అందరికీ ప్రభుత్వం ద్వారా లబ్ధి చేకూర్చాలనే ఉన్నతమైన ఆశయంతో ఈ వ్యవస్థను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సంక్షేమ పథకాల లబ్ధి అందజేయడం, అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారితో దరఖాస్తు చేయించి, ఆఫీసుల చుట్టూ తిరగాకుండా వాలంటీర్ ఉత్తమమైన సేవలు అందించి, ఒక కుటుంబ సభ్యునిగా గుర్తింపు పొందున్నట్టు తెలిపారు. కోవిడ్ సమయంలో వైద్యులు సైతం ముందుకు రాని సందర్భాల్లో వాలంటీర్ సేవలు అందించినట్లు పేర్కొన్నారు. ప్రతినెలా ఒకటో తేదీన పెన్షన్ పంపిణీ ఉదయం 6 నుంచి చేపట్టి మధ్యాహ్నం అందజేస్తూ, విధి నిర్వహణలో మమేకం అవుతున్నట్లు కలెక్టర్ ప్రశంసించారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ మరింత బలోపేతం చేయడంలో వాలంటీర్ల కృషి వెలకట్టలేనిదని రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిల రెడ్డి అన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తూ ప్రభుత్వ సేవలను, విధానాలను ప్రజలకు చేర వేసే గొప్ప సాధనం వాలంటీర్ల వ్యవస్థ అని పేర్కొన్నారు. మొత్తం జిల్లాలో 9516 మంది వాలంటీర్లు పని చేస్తున్నారని, వారిలో సేవా మిత్ర పురస్కారం పొందిన 8,549 మందికి ఒక్కొక్కరికీ రూ.10 వేలు, సేవారత్న 122 మందికి ఒక్కొక్కరికీ రూ.20 వేలు, సేవ వజ్ర -33 మందికి ఒక్కొక్కరికీ రూ.30 వేల చొప్పున మొత్తం ఆర్థిక ప్రోత్సాహాన్ని అందించినట్టుర్ల తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డిప్యూటీ కమిషనర్ పిఎం సత్యవేణి, డిఎల్‌డిఒలు పి.వీణా దేవి, వి.శాంతమణి పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా 36 పరీక్షా కేంద్రాలు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు అత్యంత పటిష్టంగా జిల్లావ్యాప్తంగా 36 పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్టు డిఆర్ఒ జి.నరసింహులు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన తన ఛాంబర్‌లో సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో మే 24 నుంచి జూన్ 1 వరకు ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా సమయానికి గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. రాజమండ్రి డివిజన్‌లో 25 కేంద్రాలు, కొవ్వూరు డివిజన్‌లో 11 కేంద్రాల్ల పరీక్షలు జరుపుతున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పోలీసు అధికారులకు తెలిపారు. జిల్లాలో 3 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించామని, అక్కడ ప్రత్యేక పర్యవేక్షణ అవసరం అన్నారు. మొదటి ఏడాది పరీక్షకు 13,131 మంది, 2వ ఏడాది పరీక్షకు 4,498 మంది హాజరు కానున్నారని ప్రాంతీయ ఇంటర్మీడియట్ అధికారి ఎన్ఎస్‌విఎల్ నరసింహం తెలిపారు. ఒకేషనల్ విద్యార్థులు మొదటి ఏడాది 887 మంది, రెండో ఏడాది 820 మంది పరీక్షలకు హాజరు కానున్నరని పేర్కొన్నారు. కలెక్టర్ మాధవీలత చైర్మన్‌గా పరీక్షల నిర్వహణ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఒకేషనల్ అధికారి జెవిఎస్ఎస్.సుబ్రహ్మణ్యం, డిపిఒ పి.జగదాంబ పాల్గొన్నారు.

మహానాడు అతిథులకు స్వాగత ఏర్పాట్లు

ప్రజాశక్తి-కడియం

వేమగిరిలో ఈ నెల 27, 28 తేదీల్లో టిడిపి మహానాడుకు వచ్చే అతిథులు, టిడిపి కార్యకర్తలకు అపూర్వ స్వాగత ఏర్పాటు చేస్తున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చియ్యచౌదరి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు రెడ్డి సుబ్రమణ్యం, ఆదిరెడ్డి వాసు, బండారు సత్యానందరావు, జ్యోతుల నవీన్ మహానాడు సభాప్రాంగణాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోదావరి ఆతిథ్యాన్ని వేనోళ్ళ చెప్పకునేలా భారీ ఏర్పాట్లు చేసేందుకు ప్రణాళికస్తున్నట్లు తెలిపారు. మహానాడుకు వచ్చే ప్రతి కార్యకర్త ముఖ్య అతిథిగానే భావించాలని ఆ దిశగా ప్రతి ఒక్కరికి ఆతిథ్యం అందాలని తీర్మానించారు. పార్టీ అధినాయకుడు చంద్రబాబు ఈ మహానాడు ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారని ఆయన ఆదేశాల మేరకు చకచగా చర్యలు చేపడుతున్నట్టు ఎంఎల్ఎ బుచ్చియ్య చౌదరి తెలిపారు.

నూతన క్వార్టర్స్ నిర్మాణానికి చర్యలు

ప్రజాశక్తి-ఉండ్రాజవరం

శిథిలమైన పాత క్వార్టర్స్‌ను తొలగించి, వాటి స్థానే స్టాఫ్‌కు నూతన కాటేజీలు నిర్మించేందుకు తగిన చర్యలు చేపట్టాలని జిల్లా వైద్యాధికారి కె.వెంకటేశ్వరరావు సూచించినట్లు ఉండ్రాజవరం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఆర్.ప్రసాద్ తెలిపారు. శుక్రవారం జిల్లా వైద్యాధికారి ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నట్టు డాక్టర్ ప్రసాద్ తెలిపారు. ప్రతి జాతీయ కార్యక్రమాలకు సంబంధించి అన్ని రికార్డ్‌లను, రూమ్‌లను పరిశీలించి తగు సూచనలు చేసినట్లు ప్రసాద్ తెలిపారు. సిబ్బందినీ, రోగులకు అందించే సేవల గురించి సంతప్తి వ్యక్తం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఎస్ఆర్ ఫాలోవర్స్ మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఎంఎస్ఆర్ ఫాలోవర్స్ చేపట్టిన మజ్జిగ పంపిణీ కార్యక్రమం రెండో రోజు శుక్రవారం కొనసాగింది. బాటసారుల కోసం గురువారం నందం గనిరాజు జంక్షన్‌లో మజ్జిగ పంపిణీ చేయగా రెండో రోజు శుక్రవారం ఆజాద్ చౌక్‌లో ఎంఎస్ఆర్ ఫాలోవర్స్ ఆధ్వర్యంలో మైనారిటీ నాయకులు ఎస్‌కె.షరీఫ్, ఎస్‌కె బాషా నేతత్వంలో మజ్జిగ పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం షర్మిలరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సాధ్యమైనంత వరకు బయటకు రాకుండా ఉండాలని, ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నందున తలకు రక్షణగా టోపీ, గొడుగు, రుమాలు ఉంచుకోవడం మంచిదన్నారు.

కార్టూ'నిజం'



మీకు మేలు చేసే మరో కార్యక్రమం..
2 వేల నోటు రద్దు చేస్తున్నాం..!!

గ్రంథాలయాలను సందర్శించాలి

ప్రజాశక్తి-చాగల్లు

విద్యార్థులు వేసవి సెలవులలో అందుబాటులో ఉన్న గ్రంథాలయాలను సందర్శించి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గ్రామ సచివాలయ సెక్రెటరీ వీరవల్లి సుజాత అన్నారు. శుక్రవారం చంద్రవరం శాఖా గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులో పాల్గొని మాట్లాడారు. పుస్తకాలపై ఆసక్తిని పెంచడం కోసం ఈ వేసవి విజ్ఞాన శిబిరాలు ఉపయోగపడతాయని, సెల్ ఫోన్లతో కాలక్షేపం చేయకుండా విద్యార్థులు గ్రంథాలయంలో లభించే పుస్తకాలతో గడపాలన్నారు. విజ్ఞానంతో పాటు వినోదాన్ని కలిగించే క్రీడ సామాగ్రి కూడా విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయని ఉపయోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె.సుమన్ కుమార్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

దోమల నివారణ సామాజిక బాధ్యత

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

దోమల నివారణ సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరు గుర్తించాలని తణుకు వెక్టార్ బోర్న్ డిసీజెస్ కంట్రోల్ సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఉండ్రాజవరం పిహెచ్‌సి పరిధిలోని వడ్లూరులో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, మురుగు నీరు పారుదలకు ఆటంకం కలగకుండా డ్రైన్‌లలో చెత్త వేయకుండా పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి

దక్షిణ భారత కమ్యూనిస్ట్ ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయనకు పలువురు ఘనంగా నివాళులర్పించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

రాజమహేంద్రవరం పేపర్ మిల్ వద్ద గల బిటిఆర్ భవన్‌లో ఎస్ఎస్.మూర్తి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడారు. నిజాయతీకి నిలువెత్తు నిదర్శనంగా సుందరయ్య నిలిచారన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు జువ్వల రాంబాబు, రాజమండ్రి నగర కార్యదర్శి బి.పవన్, సిపిఎం సీనియర్ నాయకులు పోలిన వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.తులసి, బి.రాజులోవ, ఎం.సుందరబాబు పాల్గొన్నారు. ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయంలో టిఎస్.ప్రకాశ్ నివాళులర్పించారు. ఎడిషన్ మేనేజర్ డి.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు. **నిడదవోలు** నవోదయగ్యాస్ వర్కర్స్ యూనియన్, సిపిఎం ఆధ్వర్యాన నివాళు లర్పించారు. సిపిఎం నాయకులు జువ్వల రాంబాబు సుందరయ్య చిత్ర పటానికి పూలమాలలు వేశారు. అనంతరం 1000 మందికి సుందరయ్య సేవాసమితి ఆధ్వర్యాన మజ్జిగా పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో జి.డానియల్, ఉస్మాన్, గంటి కష్ణ, రసూల్, గండి శ్రీనివాసరావు, కొర్లపాటి ప్రసాద్, శ్యామ్, తారక్, సత్యనారాయణ పాల్గొన్నారు. **చాగల్లు** మండలం ఊనగట్లలో సిపిఎం ఆధ్వర్యాన సివిల్ సప్లైస్ హమాలీ కార్మికులు నివాళి అర్పించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు జువ్వల రాంబాబు, దిడ్ల సత్యనారాయణ. సారిక శ్రీను, సత్తి పండు, శ్యామ్, వెంకటేష్, యేసు కార్మికులు పాల్గొన్నారు. **తాళ్లపూడిలో** సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.సుందర బాబు సిఐటియు నాయకులు ఎస్.వెంకటేశ్వర రావు, వల్లేపల్లి నరసింహమూర్తి, ఎన్.పోసి బాబు, ఎస్.గంగరాజు, ఎం.శేషగిరిరావు, జి.సత్యనారాయణ, వై.నాగేంద్ర, సిహెచ్.పిచ్చిబాబు, ఎంవి సత్యనారాయణ, జె.గంగరాజు పాల్గొన్నారు.



నిడదవోలులో..



రాజమండ్రి సభలో మాట్లాడుతున్న అరుణ్



రాజమహేంద్రవరం ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయంలో..

అవకాశాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ప్రభుత్వ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి ఎం.కొండలరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఎపి నైపుణ్యాభివద్ధి సంస్థ అధ్వర్యంలో హెచ్‌సిఎల్ టెక్ బీ డ్రైవ్ నిర్వహించినట్టు తెలిపారు. ఈ డ్రైవ్‌కు జిల్లా నలుమూలల నుంచీ 33 మంది హాజరు కాగా ఆరుగురిని ఎంపిక చేసినట్టు తెలిపారు. ఈ డ్రైవ్‌లో ప్రతిభను కనపరిచిన అందరినీ ఆయన అభినందించారు, సెలక్ట్ కానీ వారు నిరుత్సాహ పడనవసరం లేదని, ఎంసెట్ పరీక్ష కారణంగా హజరుకాలేక పొయిన వారి కోసం త్వరలోనే మరొక డ్రైవ్ నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సిఎల్ కంపెనీ ప్రతినిధులు, రాజ్‌కుమార్, పద్మావతి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాలకు ఇద్దరు ఎంపిక

ప్రజాశక్తి-గోపాలపురం

జగనన్న ఆణిముత్యాలకు మండలంలోని ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఇఒ జి.శ్రీనివాసరావు తెలిపారు. జగన్నాథపురం జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థిని పుప్పల హర్షవర్ధన ద్వితీయ, రాజంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ముత్తనబోయిన లేఖన తృతీయ అవార్డుకు ఎంపికైనట్టు ఎంఇఒ తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో మండలాలకు సంబంధించి ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్టు ఎంఇఒ తెలిపారు. ఎంపికైన విద్యార్థులందరికీ ఈ నెల 25న దేవరపల్లి హైస్కూల్‌లో మొదటి బహుమతిగా రూ.15 వేలు, రెండో బహుమతిగా రూ.10 వేలు, మూడో బహుమతిగా రూ.5 వేలు అందజేయనున్నారని తెలిపారు.

పగడ్బందీగా జగనన్న విద్యా కానుక పంపిణీ

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఈ విద్యా సంవత్సరం జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆర్‌జెడి జి.నాగమణి తెలిపారు. రాజమహేంద్రవరం అర్బన్‌లోని ఎస్‌కెవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని స్టోరేజ్ పాయింట్‌ను శుక్రవారం ఆమె సందర్శించారు. విద్యా కానుక కిట్స్ స్టోర్ రూమ్‌లను పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. స్టాక్ అర్బన్ రేంజ్ డిఐ బి.దిలీప్ కుమార్ ఆర్‌జెడికి ఏర్పాట్లను వివరించారు.

మహానాడుకు వసతి సౌకర్యాల కల్పన

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

టిడిపి ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మహానాడుకు వచ్చే వారికి వసతి సౌకర్యాల కల్పన ఈ నెల 22కు ఖరారవ్వాలని పార్టీ ముఖ్య నాయకులు సూచించారు. మోరంపూడి సెంటర్‌లోని గన్నీస్ శుభమస్తు ఫంక్షన్ హాల్లో మహానాడు వసతి కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మాజీ హోమ్ శాఖ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప, శాసనమండలి మాజీ ఉప సభాపతి రెడ్డి సుబ్రహ్మణ్యం, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కష్ణ, మాజీ ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, నల్లమిల్లి రామకష్ణారెడ్డి, బండారు సత్యానందరావు, బూరుగుపల్లి శేషారావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు యర్రా వేణుగోపాలరాయుడు, ఆదిరెడ్డి వాసు, రాష్ట్ర కార్యదర్శులు కాశి నవీన్ కుమార్, వాసిరెడ్డి రాంబాబు, పాల్గొన్నారు.



ఏర్పాట్లపై సమీక్షిస్తున్న నాయకులు

వేసవి శిబిరాన్ని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక సీతానగరం గ్రంథాలయ అధికారి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో చదవడం మా కిష్టం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు గణిత ఉపాధ్యాయులు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కన్నూరి సతీష్ బాబు కెరీర్ గైడెన్స్‌పై అవగాహనా కల్పించారు. అనంతరం గణిత సూత్రాలు చెప్పి వాటికి సంబంధిచిన ప్రతులను ఉచితంగా అందించారు. ఈ వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు అందరూ వినియోగించుకోవాలని గ్రంథాలయ అధికారి అరుణ్ కుమార్ పిలుపునిచ్చారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

జేగురుపాడు సర్పంచ్ స్టాలిన్‌కు సత్కారం

ప్రజాశక్తి-కడియం

ఇటీవల కడియం మండలం జేగురుపాడు పంచాయతీ 'రాష్ట్ర ఉత్తమ పంచాయితీ'గా అవార్డు పొందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా జేగురుపాడు సర్పంచ్ వై.సతీష్ చంద్ర స్టాలిన్‌ను ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కోరుకొండ చిరంజీవి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ గ్రామాభివద్ధి కోసం స్టాలిన్ చేస్తున్న కషి గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి రాజేంద్ర ప్రసాద్, గండి స్వామి ప్రసాద్, అద్దంకి రాజా, ఉసురుమర్తి రామారావు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో డిఎంహెచ్‌ఒ తనిఖీ

పెరవలి : మండలంలోని కానూరు పిహెచ్‌సిలో ఉదయం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వర్ల రావు ఆకస్మిక తనిఖీ చేశారున. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ పి.తేజశ్రీ, డాక్టర్ కె.హేమరాజును కలసి ఆసుపత్రి సిబ్బంది పనితీరుపై సమీక్ష నిర్వహించారు. గ్రామ స్థాయిలో జరిగే అన్నీ జాతీయ కార్యక్రమాలను 100 శాతం లక్ష్యాలను సాధించాలని. ప్రతి సచివాలయంలో జరిగే ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం గురించి ప్రజలకు పూర్తిగా అవగాహన కల్పించాలని తెలిపారు.

నిత్యావసరాల పంపిణీ

చాగల్లు : చాగల్లు మండలం నెలటూరు గ్రామంలో శుక్రవారం ఒక పేద కుటుంబానికి మదర్ తెరిసా సేవా సమితి అధ్యక్షుడు పోలిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

నేరాలు ఘోరాలు

షార్ట్ సర్క్యూట్‌తో హోటల్, కిరాణా షాపు దగ్ధం

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

మండలంలోని వేట్లపాలెం గ్రామంలోని గూడపర్తి డాక్టర్ బాబు జగ్జీవన్ విగ్రహం వద్ద గల ఒక కిరాణా షాపు, హెూటల్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా శుక్రవారం తెల్లవారు జామున అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో వ్యాపార కుటుంబానికి లక్షల్లో ఆస్తినష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు. వేట్లపాలెం గ్రామానికి చెందిన పలుకూరి గంగరాజు వారి కుమారుడు పలుకూరి భాస్కర రావులు టిఫిన్ హోటల్‌ను, కిరాణా షాపును పెట్టుకొని జీవనం కొనసాగిస్తున్నారు. అయితే శుక్రవారం తెల్లవారు జామున రెండు గంటలకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఉన్నట్టుండి మంటలు చెలరేగడంతో నివాసముంటున్న ఇంటితోపాటు కిరాణా దుకాణం, హెూటల్ దుకాణాలు పూర్తిగా దగ్ధమ య్యాయి. ప్రమాద స్థలాన్ని ఉదయం ఎంపిపి బొబ్బ రాడ సత్తిబాబు సందర్శించి పరిశీలించి, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా వచ్చే సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విఆర్ ఓలు కాశీ విశ్వనాథ్, కెవివి సత్యనారాయణలు పరిశీలించి ఆస్తినష్టం లక్షల్లో ఉంటుందని అంచనా వేశారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-గోపాలపురం

గత నెల ఒక ఇంట్లో పెట్టిన ల్యాప్ టాప్, మొబైల్ ఫోన్ లను చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎస్ఐ కె.రామకష్ణ తెలిపారు. శుక్రవారం ఎస్ఐ రామకష్ణ తెలిపిన వివరాల ప్రకారం గత నెల 30న గోపాలపురం గ్రామానికి చెందిన వేసంగి సాయి చంద్ర వర్క్ ఫర్ హోమ్‌లో భాగంగా రాత్రి తన ల్యాప్ టాప్ లో వర్క్ చేసుకున్నాడు. ఉదయాన్నే చూడగానే ల్యాప్ టాప్, మొబైల్ ఫోన్ కనిపించకపోవడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేశారు. గోపాలపురం గ్రామానికి చెందిన భూరెడ్డి వీరవెంకటనాగనవీన్ దొంగతనానికి పాల్పడినట్లు తెలిపారు.అయితే వీటితోనే పాటు గోపాలపురం గ్రామంలో వేరొకరి ఇంట్లో కూడా ల్యాప్ టాప్, మొబైల్ ఫోన్ దొంగిలించినట్లు పోలీసులు వెల్లడించారు. దీనిపై దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి కొవ్వూరు కోర్టుకు రిమాండ్ కు చెందిన తరలించినట్లు ఆయన తెలిపారు.

కోడిపందేలపై దాడి .. ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి-చాగల్లు

మండలంలోని ఉన్నగట్ల గ్రామం శివారు పొలాల్లో శుక్రవారం ఎస్ఐ సిహెచ్.వి.రమేష్ ఆధ్వర్యంలో కోడిపందేల స్థావరాల పై దాడి చేశారు. ఈ దాడులోల ముగ్గురు వ్యక్తులను అరెస్ట్‌చేశారు. వారి నుంచి రెండు కోడి పుంజులను రెండు కోడి కత్తులు రూ.21,430 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రేమికుల ఆత్మహత్యాయత్నం యువతి మృతి

ప్రజాశక్తి-పెరవలి

మండలం అన్నవార్పడు గ్రామానికి చెందిన ప్రేమికులు ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ ఘటనలో యువతి మృతి చెందింది. యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వివరాలు వెళితే గ్రామంలో ఎస్‌సి కాలనీకి చెందిన కంకిపాడు హర్షిత వయసు (14) ఆకుమర్తి సూర్యారావు(23) ఇద్దరు గత కొన్ని రోజులుగా ప్రేమించుకుని గురువారం వివాహం చేసుకున్నారు. కుటుంబ సభ్యులు పెళ్లికి నిరాకరి ంచడంతో హర్షిత బాత్రూంలో ఉరి వేసుకుని ఆత్మ హత్య చేసుకుంది. సూర్యారావు పురుగుల మందు తాగడంతో ప్రయివేటు హాస్పటల్ తరలించగా చికిత్స పొందుతున్నాడు. హర్షిత 9వతరగతి పూర్తి చేసి పదవ తరగతిలో వచ్చింది. తల్లి లేదు, తండ్రి ఒక చెల్లి ఉన్నా రు. సూర్యారావు పెయింటింగ్ వర్క్ చేస్తాడు. దీనిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎం.సూర్యభగవాన్ తెలిపారు.

కత్తితో దాడి చేసిన కేసులో నిందితునికి జైలు

ప్రజాశక్తి - అంబాజీపేట

ఒక వ్యక్తిపై కత్తిలో దాడి చేసిన కేసులో నిందితునికి అమలాపురం అసిస్టెంట్ సెషన్ జడ్జి కుమారి 13 నెలల జైలు శిక్ష విదిస్తూ శుక్రవారం తీర్పు చెప్పినట్లు ఎస్ఐ ఎ.చైతన్య కుమార్ తెలిపారు. వాకలగరువులో పాతకక్షలు నేపథ్యంలో వాకపల్లి వీరబాబుపై అదే గ్రామానికి చెందిన గోనెమడతల సూరిబాబు (నాని) 2020 అక్టోబర్ 18న దారి అడ్డగించి కత్తితో గాయపరిచాడు. దీనిపై వీరబాబు ఇచ్చిన ఫిర్యాదుపై అప్పటి ఎస్ఐ జానీ బాషా కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితుడు సూరిబాబును రిమాండ్‌కు పంపారు. తదుపరి అమలాపురం అసిస్టెంట్ సెషన్స్ కోర్టు ట్రయిల్ నిర్వహించింది. కేసుకు సంబంధించి అడిషనల్ పిపి కె.వెంకటలక్ష్మి ప్రాసిక్యూషన్ అందించారు.

పిచ్చికుక్క దాడిలో పది మందికి గాయాలు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

పిచ్చికుక్క దాడిలో శుక్రవారం పదిమంది గాయపడ్డారు.గొల్లవిల్లి పంచాయితీ వాడపర్రులో నలుగురు, గొల్లవిల్లిలో ఒకరు, సన్నవిల్లి లో నలుగురు, పెదగాడవిల్లిలో ఒకరికు పిచ్చికుక్క దాడిలో గాయపడ్డారు. బాధితులకు ఉప్పలగుప్తం పి హెచ్ సి వైద్యులు ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం నిమిత్తం అమలాపురం ఆసుపత్రికి తరలించారు

లారీ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-మండపేట

లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణ శివారు వీరభద్రపురం మెయిన్ రోడ్డులో శుక్రవారం జరిగింది. అనపర్తి మండలంలోని రామవరం గ్రామంలోని తూర్పుపేటకు చెందిన మురమళ్ళ రాము మత్స్యకారుడుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఉదయం వ్యాపారం నిమిత్తం చేపల కొనేందుకు అతని స్నేహితుడు అమ్మజూరి గోవిందుతో కలిసి ద్విచక్రవాహనంపై మండపేటకు వస్తున్నారు. ఈ సమయంలో వీరభద్రపురం మెయిన్ రోడ్డు వద్దకు వచ్చేసరికి సోమేశ్వరం నుంచి మండపేట వస్తున్న లారీ వీరి మోటర్ సైకిల్ ను వెనుక నుంచి ఢీకొంది. దీంతో రాము అక్కడక్కడే మృతి చెందాడు. అతని స్నేహితునికి తీవ్ర గాయాలపాలయ్యాడు. వైద్యం నిమిత్తం అతనిని మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పట్టణ ఎస్ఐ అశోక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



క్రికెట్ టోర్నీని ప్రారంభించిన ఆర్ఎఒ మునిస్వామి, ఎస్‌పి రఘునాయిగం

సియాచెమ్ 2023 క్రికెట్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సియాచెమ్ 2023 ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్ స్థానిక మెట్టకూరు ప్రభుత్వ హైస్కూల్ మైదానంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్ ఏ ఓ మునిస్వామి, ఎస్పి రఘునాయిగం, సిఐ షణ్ముగం, ఎడిబిసి కమిడి ప్రభాకర్ లు పాల్గొని ప్రారంభించారు. ఉదయం ఆడిన రామాయాత్-ఎ వర్సెస్ నాగా లెవన్స్ తలపడగా నాగా లెవన్స్ విజయం సాధించగా, మధ్యాహ్నం ఆర్‌వైసి వర్సెస్ అంబేద్కర్ లెవన్స్ టీంలు తలపడగా ఆర్‌వైసి ఘన విజయం సాధించిందని అసోసియేషన్ అధ్యక్షుడు పంతగడ సుమన్ బాబు తెలిపారు. ఈ టోర్నీలో మొత్తం పది జట్లు పోటీ పడనున్నాయని, ఈ నెల 30 వరకు మ్యాచులు జరుగుతాయని తెలిపారు.

వర్శిటీకి న్యాక్-ఎం గ్రేడ్

- జెఎన్‌టియు విసి ప్రసాదరాజు

ప్రజాశక్తి - కాకినాడ

జవహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం కాకినాడ (జెఎన్టియుకె)కు నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) ఎం గ్రేడ్ లభించినట్లు ఉపకులపతి జివిఆర్.ప్రసాదరాజు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన డైరెక్టర్లు, యూనివర్శిటీ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. యూనివర్శిటీలో ఈ నెల 9, 10, 11వ తేదీలలో మూడు రోజుల పాటు పర్యటించిన న్యాక్ పీర్ టీమ్ నివేదికలను పరిశీలించి 3.45 స్కోర్తో యూనివర్శిటీకి న్యాక్-ఎం గుర్తింపు ప్రకటించిందన్నారు. యూనివర్శిటీకి ఐదు సంవత్సరాలు పాటు న్యాక్ ఎం గుర్తింపు లభించిందని, ఇది వరకు 2017 నుండి 2022 వరకు న్యాక్ గుర్తింపు పొందడం జరిగిందని, ప్రస్తుత న్యాక్ ఏం గుర్తింపు ద్వారా విశ్వవిద్యాలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు అవకాశం లభిస్తుందన్నారు. యూనివర్శిటీకి న్యాక్ ఏం గ్రేడ్ లభించేందుకు కృషి చేసిన అందరికి విసి.ప్రసాదరాజు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో రెక్టార్ కెవి. రమణ, రిజిస్ట్రార్ ఎల్.సుమలత, ఒఎస్‌డి డి.కోటేశ్వరరావు, డైరెక్టర్లు, యుసిఇకె ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నవరం ఎస్ఐ శోబన్ కుమార్ సస్పెన్షన్?

ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరం పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ శోభన్ కుమార్‌ను జిల్లా పోలీస్ అధికారులు సస్పెన్షన్ చేశారు శోభన్ కుమార్ 2022 మార్చిలో అన్నవరం ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు సుమారు 15 నెలలు తిరగకుండానే సస్పెన్షన్ చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

ఆర్ఆర్ సెంటర్ల ఏర్పాటు

ప్రజాశక్తి - కోటనందూరు

తుని పురపాలక సంఘం పరిధిలో ఆర్ఆర్ సెంటర్లను ఏర్పాటు చేసినట్టు తుని మునిసిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ జివిఆర్ శేఖర్ తెలిపారు. ఈ నెల 20 నుండి జూన్ 5వ తేదీ వరకు పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా తుని పట్టణ పరిధిలో ఉన్న ప్రజల నుండి పాత వస్తువులు ఆయన పుస్తకాలు, ఆట వస్తువులు, ప్లాటిక్ వస్తువులు సేకరించేందుకు ఆర్ఆర్ ఆర్ రెడ్యూస్ రీసైకిల్, రీ యూస్ సెంటర్లు ఈ సేవ సెంటర్, పాత గ్రంథాలయం వద్ద ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 30వ వార్డ్ ఉన్న ప్రజలు వాడనటువంటి వ్యర్థంగా ఉన్న వస్తువులను ఈ సెంటర్ వద్ద అప్పగించవచ్చని సూచించారు. సందర్భంగా తెలియజేశారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరూ పాలు పంచుకోవాలని ఆయన ప్రజలను కోరారు.

యండమూరులో పీర్ వెరిఫికేషన్

ప్రజాశక్తి- కరప

యండమూరి గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా శుక్రవారం ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు పీర్ వెరిఫికేషన్ నిర్వహించారు. గ్రామ పరిధిలో ఉన్న వాటర్ ట్యాంకులను శుభ్రం చేసి మంచినీటిని అందించాలని, డ్రైనేజీలు ఎప్పటి కప్పుడు శుభ్రపరిచి దోమల నివారణ మందులను జల్లాలని, కచ్చా డ్రైన్లు తవ్వించి నీరు పోయే మార్గాలు ఏర్పాటు చేయాలన్నారు. నీరు పొదుపు చేసే విధంగా సర్పంచులు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. చెత్త నుండి సంపద కేంద్రాలకు తడి పొడి చెత్తలను వేరువేరుగా సేకరించి సంపద సృష్టించాలని ఇఒపిఆర్‌డి సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మారెళ్ళ శ్రీనివాస్, కార్యదర్శి వీరభద్రరావు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

నిలిచిన అక్రమ మట్టి తరలింపు

ప్రజాశక్తి-కాట్రేనికోన

అనుమతులు లేకుండా మట్టిని అక్రమంగా తరలిస్తున్న మట్టి లారీలు మైనింగ్ అధికారులు రావడంతో నిలిచిపోయాయి. మండల పరిధిలోని వివిధ గ్రామాలలో రాత్రి పగలు అనే తేడా లేకుండా మట్టిని లారీల్లో కొందరు వ్యక్తులు అక్రమంగా తరలిస్తున్నారు. దీంతో మైనింగ్ శాఖ అధికారులు ఆకస్మిక దాడులు చేయడంతో శుక్రవారం ఆ పనులకు బ్రేక్ పడింది. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం గురువారం అర్ధరాత్రి సమయంలో పల్లంకుర్రు నుంచి కాట్రేనికోన వెళుతున్న రెండు లారీలను పట్టుకుని కందికుప్ప పెట్రోల్ బంక్ సమీపంలో లే అవుట్ లో నిలుపుదల చేశారు. తనిఖీ సమయంలో అనుమతి పత్రాలు లేకపోవడంతో మట్టి లారీలపై కేసులు నమోదు చేసినట్లు సమాచారం. తెల్లవారిసరికి మట్టి లారీలు అదశ్యం కావడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. ఏదేమైనా సంబంధిత శాఖ అధికారులు అక్రమ మట్టి తవ్వకాలు వాటి తరలింపు పై కఠిన ధరలు తీసుకుని ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-రాజోలు

రాజోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ఈనెల 20 న శనివారం ఉచిత మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎ1 సేవా సమితి వ్యవస్థాపకుడు చెల్లుబోయిన శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ. ఎన్‌టిఆర్ శత జయంతి ఉత్సవాలు, ఎ1 సేవా సమితి 7 వ వార్షికోత్సవం సందర్భంగా ఉచిత మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు వినియోగించుకోవాలన్నారు.

ఆఫ్‌లైన్ విద్యలో అర్హులకు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి-అమలాపురం

వచ్చే విద్యా సంవత్సరంలో నాణ్యమైన ఆఫ్‌లైన్ విద్యలో అర్హులైన విద్యా ర్థులకు రూ.160 కోట్ల విలువైన స్కాలర్ షిప్‌లను అందించాలని ఫిజిక్స్ వాలా సిఇఒ అలఖ్ పాండే శుక్రవారము ఒక ప్రకటనలో తెలిపారు. గత విద్యా సంవత్సరంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు ఇప్పటికే రూ.100 కోట్లకు పైగా ప్రోత్సాహకాలను అందించామని తెలిపారు.అర్హులైన విద్యార్థులకు స్కాలర్షిప్లు, మెంటర్షిప్ ద్వారా అసాధారణమైన విద్యావకాశాలను అందించడంలో ఫిజిక్స్ వాల్లా తిరుగులేని నిబద్ధతకు అడ్మిషన్ టెస్ట్ నిర్వహణ నిలుస్తుందన్నారు.

126 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం బీసీ ఏరియా రామాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరంలో 126 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్ అన్నారు. డాక్టర్ పిఎన్ఎస్‌డి.రత్నకుమారి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది పలు వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. **అమలాపురం రూరల్** కామనగరువు చిట్టమ్మ చెరువులో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపును గ్రామ సర్పంచ్ నక్కా అరుణకుమారి సందర్శించారు. ఆమె మాట్లాడుతూ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కుమార్ యాదవ్

ఆరోగ్య సంరక్షణలో కుటుంబ వైద్యుల పాత్ర కీలకం

ప్రజాశక్తి - కాకినాడరూరల్

ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలలో కుటుంబ వైద్యుల పాత్ర, వారి సహకారం ఎంతో కీలకమని డాక్టర్ కుమార్ యాదవ్ అన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ కుటుంబ వైద్యుల దినోత్సవం నిర్వహించారు. డాక్టర్ యాదవ్ మాట్లాడుతూ రోగులకు సంబంధించిన సమగ్రమైన దీర్ఘకాలిక ఆరోగ్య సంరక్షణను అందించడంలో. కుటుంబ వైద్యునికి రోగి శరీరతత్వం, ఏ మందులు వాడితే నయమ వుతుందన్నది పూర్తిగా అవగాహన ఉంటుందన్నారు. గ్రామాలు, చిన్న పట్టణాలలో రోగులకు ఇప్పటికీ కుటుంబ వైద్యులు వైద్య సేవలు అందిస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కుటుంబ వైద్యుల సేవలు అంటూ రోగుల ఇళ్లకి వైద్యులను ప్రతి 15 రోజులకు ఒకసారి సందర్శించే కార్యక్రమాన్ని చేపట్టిందని డాక్టర్ యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, శ్రీనగేష్, రేలంగి బాపిరాజు పాల్గొన్నారు.

అలయన్స్ నిత్యావసర వస్తువుల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడరూరల్

రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అలియన్స్ క్లబ్‌కాకినాడ సేవా శక్తి ఆధ్వర్యంలో అధ్యక్షులు లక్ష్మీనాగేంద్ర అధ్యక్షతన శుక్రవారం దీర్ఘకాలిక రోగులకు నిత్యవసర సరుకుల పంపిణీ చేశారు. అలియన్స్ క్లబ్ నాయకులు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, అలియన్స్ క్లబ్ మాజీ గవర్నర్ కె. మునిరెడ్డి, జోన్ చైర్మన్ సుభద్ర, చంటి, శివ, రవిశంకర్ పట్నాయక్, అడబాల రత్న ప్రసాద్, రాజా, రేలంగి బాపిరాజు, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కోటనందూరు

ఇటీవల అనారోగ్యంతో మరణించిన కెఇ చిన్నయపాలెం గ్రామానికి చెందిన సురేష్ ఫోటో స్టూడియో యజమాని యమ్మల సురేష్ కుటుంబాన్ని శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ఫోటోగ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, డాగురె సురక్ష యోజన ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు పోసిన వీరేంద్ర కుమార్ పరామర్శించారు. జిల్లాలో వివిధ మండలాల నాయకులు డాగురె సురక్ష యోజన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.50 వేల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. మండల సంఘం అధ్యక్షులు వమల దొంగబాబు ఆధ్వర్యంలో మరణించిన వెంటనే అంత్యక్రియల నిమిత్తం20వేలు అందజేశారు. వీరేంద్ర కుమార్, కాకినాడ జిల్లా అధ్యక్షులు బచ్చా వీర వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలలో ఫోటోగ్రాఫర్లను వృత్తి కార్మికులుగా గుర్తించాలని, వైయస్సార్ గృహ నిర్మాణ పథకంలో ఇల్లు లేని ప్రతి ఫోటోగ్రాఫర్‌కు ఇళ్ల స్థలం ఇప్పించాలని, రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్న వారి కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని మంత్రి దాడిశెట్టి రాజాని కోరారు. కార్యక్రమంలో తుని జోన్ అధ్యక్షులు తేనే లోవరాజు, బెక్కం శ్రీనివాస్ ,ప్రగడ శంకర్రావు, బెజగం కోటేశ్వరరావు, నామన వెంకట భాస్కర్ రామ్మోహన్ రావు,, భూసాల ప్రసాద్ పాల్గొన్నారు.

రాఘవపట్నం లో పారిశుధ్య నిర్వహణ పనులు

ప్రజాశక్తి- రౌతులపూడి

రాఘవపట్నం పంచాయతీలో గల మాతీయపేట, రాఘవపట్నం గ్రామాలలో శుక్రవారం సర్పంచ్ లో వరాజు, కార్యదర్శి సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టారు.

21న కాంట్రాక్టు లెక్చరర్ల సమావేశం

ప్రజాశక్తి -ఏలేశ్వరం

కాకినాడ యుటిఎఫ్ భవన్‌లో ఈ నెల 21న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొర్ల మాణిక్యం తెలిపారు. సమావేశంలో కాంట్రాక్ట్ లెక్చరర్స్ సర్వీస్ రెగ్యులేషన్, పురుగు రాష్ట్రాల్లో కాంట్రాక్టు లెక్చరర్స్ ను క్రమబద్ధీకరించడం, తదితర అంశాలపై చర్చించడంతోపాటు పోరాట కార్యాచరణ రూపొందిస్తారన్నారు. ప్రతి ఒక్క కాంట్రాక్టు లెక్చరర్ సమావేశానికి హాజరుకావాలసిందిగా ఆయన కోరారు.

గాయత్రి వాకర్స్ మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడరూరల్

సర్పవరం జంక్షన్‌లో గాయత్రి వాకర్స్ అండ్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో బాటసారులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. వాకర్స్ సంఘ కోఆర్డినేటర్ ఎం. ప్రభావతి, కోమలి, నీలిమ, విజయ, రాజి తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని నదీ ప్రాంతాల్లో స్నానాల నిషేధం

ప్రజాశక్తి - ఆలమూరు

ఆలమూరు ఎస్ఐ ఎస్.శివప్రసాద్ ఆదేశాల మేరకు మండలంలోని రెడ్ జోన్ ప్రాంతమైన బడుగువానిలంక గౌతమి గోదావరి నదీ ప్రాంతంలో స్నానాలకు అనుమతి లేదంటూ హెచ్చరికలతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటుచేశారు. సర్పంచ్ దూలం వెంకటలక్ష్మి, మహిళ పోలీస్ డి.కృష్ణవేణి, కార్యదర్శి యు.సుప్రియ ఆధ్వర్యంలో ఈ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ ఈత రానివారు గోదావరి, కాలువల వద్దకు ఒంటరిగా వెళ్లకూడదని సూచించారు. ఈ ప్రాంతంలో పోలీసువారి నిఘా ఏర్పాటు చేశామని, స్నానాలను పూర్తిగా నిషేధించామని వారు తెలిపారు.

ఆకట్టుకున్న 'ఆఫ్‌సైట్' మాక్ డ్రిల్

ప్రజాశక్తి-అమలాపురం

ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ కాకినాడ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధికారులతో కలిసి శుక్రవారం ఓడలరేవు ఆన్‌షోర్ టెర్మినల్లో 'ఆఫ్ సైట్ మాక్ డ్రిల్' ఆకట్టుకుంది. ఎగ్జిక్యూటివ్- డైరెక్టర్ అసెట్ మేనేజర్ రత్నేష్ కుమార్ నేతృత్వంలో ఎమర్జెన్సీ రెస్పాన్స్ డ్రిల్ విఎఎస్ 1ప్లాంట్‌కు వశిష్ట యు ఫీల్డ్ సబ్‌సీ బావులను అనుసంధానించే 14' హై ప్రెజర్ గ్యాస్ పైప్‌లైన్‌ల నుంచి గ్యాస్ లీకేజీ దృశ్యాన్ని ప్రదర్శించారు. డిజిఎంఎస్ మార్గదర్శకాల ఆధారంగా ఒఎన్‌జిసి భద్రతా విషయంలో అంతర్భాగమైన క్రమానుగతంగా నిర్వహించబడే మాక్ డ్రిల్‌లో ఆర్‌డిఒ వసంత రాయుడు, ఒఎన్‌జిసి అధికారులతో పాటు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి కుడుపూడికి సన్మానం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

అమలాపురం స్థానిక వెంకటేశ్వరా కళాశాల అధ్యాపకులు, యాజమాన్యం ఎంఎల్‌సి కుడిపూడి సూర్యనారాయణ ని శుక్రవారం ఆయన క్యాంప్ కార్యాలయం వద్ద సన్మానించారు. వైస్ చైర్మన్ కరాటం ప్రవీణ్ అద్వర్యం లో ఈ కార్యక్రమం సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కెవిఆర్ఎన్. నరసింహారావు, ప్రిన్సిపల్ కె.మనోహర్, యాలంగి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే సిఎం జగన్ లక్ష్యం

ప్రజాశక్తి-రావులపాలెం

ప్రజా సంక్షేమమే సిఎం జగన్ లక్ష్యమని ప్రభుత్వ విప్, కొత్తపేట ఎంఎల్‌ఎ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. శుక్రవారం గడప..గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రావులపాలెం మండలం పొడగట్లపల్లి గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆ గ్రామంలోని ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

గడువులోగా ప్రభుత్వ భవన నిర్మాణాలు పూర్తి చేయాలి

- కలెక్టర్ కృతికా శుక్లా

ప్రజాశక్తి - కాకినాడ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

ప్రభుత్వ శాశ్వత భవన నిర్మాణ పనులు వేగవంతం చేసి నిర్దేశించిన గడువు లోపు పూర్తి చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో గ్రామ, వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణ పనులు పురోగతిపై జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ భవన నిర్మాణ పనులపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకుని పని చేయాలన్నారు. మంజూరు చేసిన ప్రతి భవన నిర్మాణం వెంటనే మొదలు పెట్టాలని, నిర్మాణ పనులకు వాతావరణం అనుకూలంగా ఉన్న నేపథ్యంలో నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా గ్రామ, వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల, వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్ భవనాల పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జడ్‌పి సిఇఒ ఎన్‌వివి సత్యనారాయణ, డ్వామా పీడీ ఎం.వెంకటలక్ష్మి, డిపిఒ ఆర్.విక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఆర్.రమేష్, మైన్స్ డీడీ మైన్స్ ఇ.నరసింహారెడ్డి, పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎం.శ్రీనివాసు ఇతర అధికారులు పాల్గొన్నారు.

జగన్ ఆశీర్వదిస్తే జగ్గంపేట నుంచే పోటీ చేస్తా

-మాజీ మంత్రి తోట నరసింహం

ప్రజాశక్తి - గండేపల్లి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తోట నరసింహం

ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆశీర్వదిస్తే జగ్గంపేట నుండే పోటీ చేసేందుకు తాను సిద్ధమని మాజీ మంత్రి తోట నరసింహం స్పష్టం చేశారు. శుక్రవారం గండేపల్లి మండలం ఉప్పలపాడులో రామకుర్తి మూర్తి స్వగృహంలో నరసింహం తనయుడు రాంజీ ఈ నెల 26వ తేదీ వివాహ వేడుకకు ఆహ్వానించేందుకు ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ జగ్గంపేట నియోజకవర్గంలో ఎంఎల్ఎగా మంత్రిగా, ఎంపిగా కోట్లతో అభివృద్ధి చేశామని, నియోజకవర్గ ప్రజలు తనపై ఎన్నడూ ఆదరాభిమానాలు చూపిస్తూనే ఉన్నారన్నారు. తాను అనారోగ్యం కారణంగా కొంతకాలం రాజకీయాలకు దూరంగా ఉన్నా తనను స్వయంగా కలిసి నియోజకవర్గ విషయాలు ఎప్పటికప్పుడు ప్రస్తావించేవారని తెలిపారు. తాను ప్రస్తుతం పూర్తి ఆరోగ్యంగా ఉన్నానని త్వరలోనే నియోజకవర్గ ప్రజలందరినీ గ్రామ గ్రామాన కలుస్తానని తెలిపారు. తన తనయుడు వివాహానికి ప్రతి ఒక్కరూ హాజరై ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఓబిణ్ణి సత్యనారాయణ పరిమి వెంకటేశ్వరరావు, తోట అయ్యన్న, తొండాపు రమణారెడ్డి, రఘురామ్ రెడ్డి, తారకం ,జగాలు, శ్రీను, మండలంలోని నరసింహ అభిమానులు పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాలకు ముగ్గురు విద్యార్థినుల ఎంపిక

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు సంబంధించి ఈ ఏడాది పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే "జగనన్న ఆణిముత్యాలు" పథకంలో ప్రోత్సాహకాలు పొందేందుకు సామర్లకోట మండలం నుంచి ముగ్గురు విద్యార్థినులు ఎంపికైనట్టు ఎంఇఒ వై శివరామ కృష్ణయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో మండలానికి సంబంధించి ఉప్పరగూడెం జడ్‌పిహెచ్ పాఠశాల నుంచి తలాటం లక్ష్మి (582), నవర జడ్‌పి పాఠశాల నుంచి సన్నిబోయిన అర్చన (580), బొల్లం రెడ్డి ప్రజ్ఞ శ్రీసాయి (577) లు ప్రోత్సాహకాలకు ఎంపికైనట్టు తెలిపారు. అయితే ఈ ప్రోత్సాహకాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మూడు విడతలుగా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు నియోజకవర్గం స్థాయిలో ఈ నెల 25వ తేదీన నిర్వహించే కార్యక్రమంలో 10వ తరగతిలో మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు రూ.15వేలు, రూ.10 వేలు, రూ. 5 వేలు చొప్పున , ఇంటర్మీడియట్‌లో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 15 వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలు సత్కారాలు చేపడుతున్నట్లు చెప్పారు. అలాగే జిల్లా స్థాయిలో ఉత్తమ ర్యాంకులు పొందిన పదవ తరగతి విద్యార్థులకు ఈ నెల 27వ తేదీన రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.15 వేలు చొప్పున, ఇంటర్ విద్యార్థులకు ఒక్కక్కరికీ రూ.50 వేలు చొప్పున ప్రోత్సాహకాలు అందించనున్నట్టు తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఈ నెల 31వ తేదీన పదో తరగతి విద్యార్థులకు రూ.లక్ష, రూ.75 వేలు, రూ.50 వేలు చొప్పున, ఇంటర్ విద్యార్థు లకు ఒక్కొక్కరికి లక్ష రూపాయలు చొప్పున ప్రోత్సాహకాలు సత్కారాలు చేపట్టనున్నటి తెలిపారు. ముగ్గురు విద్యార్థులను ఎఇఒ శివరామకృష్ణయ్య పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - తుని

తుని పట్టణంలో 28వ వార్డులో శుక్రవారం మున్సి పల్ చైర్‌పర్సన్ ఏలూరు సుధారాణి బాలు రూ.16 లక్షలతో సిసిరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దశలవారీగా మున్సి పాలిటీలో ఉన్న ప్రతి వార్డులను సిసి రోడ్లు డ్రైనేజీలు నిర్మాణాలు చేడుతున్నట్టు ఆమె తెలి పారు. కార్యక్రమంలో 28 వ వార్డు కౌన్సిలర్ చింత కాయల భారతి, వైస్ చైర్మన్ పామర్తి మహేష్, గాంధీ సత్రం చైర్మన్ అనిశెట్టి సూర్య చక్రరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ రాజు పాల్గొన్నారు.

పలుచోట్ల చలివేంద్రాల ఏర్పాటు



చెముడులంకలో మజ్జిగ పంపిణీ చేస్తున్న సత్యానందరావు



పి.గన్నవరంలో చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎంపిపి,సర్పంచ్‌లు

ప్రజాశక్తి -యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల వివిధ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం చలివేంద్రాలు ఏర్పాటుచేశారు. వివరాలు ఇవి.

ఆలమూరు చెముడులంక జాతీయ రహదారి ప్రక్కన గ్రామ టిడిపి ఏర్పాట్లు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని శుక్రవారం పార్టీ ఉపాధ్యక్షులు, మాజీ ఎంఎల్ఎ బండారు సత్యానందరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తోటి వారి క్షేమం కోరి చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్న ఆలోచన చాలా మంచిదన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు చేస్తున్న టిడిపి కార్యకర్తలను ఆదర్శంగా తీసుకోవాలని ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ డిసి చైర్మన్ నాగిరెడ్డి వెంకటరత్నం, మండల టిడిపి అధ్యక్షులు మెర్ల గోపాలస్వామి, కొత్తపల్లి రాంబాబు, ఈదల నల్లబాబు, ఒంటిపల్లి సతీష్, పాలూరి గోవిందరాజు, దూలం రాంబాబు, ఆకుల రామకష్ణ, సక్కుమళ్ళ రాముడు, నైనాల శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

మామిడికుదురు(పి.గన్నవరం) వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో రహదారుల్లో చలివేంద్రాలు ఏర్పాటుతో బాటసారులకు ఉపశమనం కలిగిస్తుందని ఎంపిపి అంబటి భూలక్ష్మి అన్నారు. పి.గన్నవరం మూడు రోడ్ల కూడలి లో గురువారం నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆమెతో పాటు పి.గన్నవరం సర్పంచ్ బొండాడ నాగమణి లు ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి నేలపూడి దామోదర్, ఎంపిటిసి సమాఖ్య అధ్యక్షులు ఆదిమూలం సూర్యానారాయణ, ఎంపిడిఒ తాడి వెంకటశ్రీ ఆచార్య, అంబటి కోటేశ్వరరావు, ఉప సర్పంచ్ కె.బాబూరావు, పులపర్తి చిన సూర్య నారాయణ, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు(పి.గన్నవరం) వేసవి ఉష్ణోగ్రతల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపిపి అంబటి భూలక్ష్మి అన్నారు. ముంగండ గ్రామంలో ఇటుకల మెరకలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పథకం పనులు చేసే ఆయా గ్రామాల్లో దాతలు చలివేంద్రాలు ఏర్పాటు చేసి వేసవి ఉష్ణోగ్రతల నుంచి వారికి ఉపశమనం కల్పించాలని సూచించారు. అనంతరం ఉపాధి హామీ కూలీలకు గ్లూకోస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి చేస్తున్న కృషి ప్రశంసనీయం

ప్రజాశక్తి-అమలాపురం

వ్యవసాయ రంగానికి కృషి చేస్తున్న విధానం పట్ల రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ యం ఎస్.నాగిరెడ్డి ప్రత్యేకంగా జిల్లా కలెక్టర్ హిమన్షు శుక్లాను ప్రశంసించారు. శుక్రవారం జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం చైర్ పర్సన్ మోటూరి సాయి అధ్యక్షతన జరిగి నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రకృతి విపత్తులు, వరదలు, భారీ వర్షాలు లాంటి సమయాల్లో కోనసీమ రైతాంగం ఎదుర్కొనే ప్రధాన సమస్యలను అధిగమించడంలో జిల్లా కలెక్టర్ తీసుకుంటున్న చర్యల పట్ల అభినందనీయమన్నారు. ముఖ్యంగా ఇటీవల భారీ వర్షాలు వలన రబీ సీజన్లో రైతుల తాము పండించిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు ఉపాధి హామీ కూలీల సహాయ సహకారాలు అందించే విధంగా చేపట్టిన ప్రక్రియ పట్ల హాజరైన జిల్లా సలహా మండలి సభ్యుల తో పాటు వైస్ చైర్మన్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. కలెక్టర్, సలహా హిమాన్షు శుక్లా మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో సాగునీరు అందని ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటలుగా ఉద్యానవన పంటలను పండించే విధముగా రైతుల్లో అవగాహన కల్పించవలసిన అవసరం ఉందన్నారు. సమావేశంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా స్థాయి సభ్యులు, జిల్లా వ్యవసాయ అధికారి కాకి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గేట్‌మ్యాన్ రామారావు మృతి

ప్రజాశక్తి-కడియం

రైల్ గేటు మ్యాన్ రామారావుగా మండలంలో చాలామందికి సుపరిచితమైన కొక్కిరాల రామారావు (78) శుక్రవారం ఉదయం మృతి చెందారు. మూడు రోజులుగా కాస్తున్న ఎండలకు ఆయన అస్వస్థతకు గురయ్యారు. వైద్య సేవలు పొందుతూ తుది శ్వాస విడిచారు. కడియం, పేపర్ మిల్లు, జీవీకే, ఆడదాని రేవు, కేశవరం రైల్వే గేట్లు వద్ద దాదాపు మూడు దశాబ్దాల పాటు గేట్ మ్యాన్‌గా సేవలందించారు. రామారావు 2014లో ఉద్యోగ విరమణ చేశారు. రామారావు మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన అంత్యక్రియలు బాధ్యతా సేవా సంస్థ అధ్యక్షులు గిరజాల బాబు, కుసునూరి బాబులు, తమ్మిశెట్టి ప్రసాద్ తదితరుల ఆధ్వర్యంలో బంధుమిత్ర కుటుంబ సభ్యులతో రాజమహేంద్రవరం మహాప్రస్థానంలో శుక్రవారం ముగిశాయి.